# సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 20 । మే । 2024






**క్రీడాకారులకు ప్రోత్సాహం**

పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ ట్రాక్ ప్రారంభానికి సిద్ధమవుతోంది.

వివరాలు 8లో ▸



**నల్లబెల్లం పట్టివేత**

అక్రమంగా తరలిస్తున్న 6,270 కిలోల నల్లబెల్లాన్ని ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు.

వివరాలు 8లో ▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 37.9 /21.9

రోజులో ఎక్కువ భాగం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### అమ్మవారి చెంత భక్తుల రద్దీ



**నవాబుపేట:** మండలంలోని మైసమ్మ అమ్మవారి చెంత భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం భక్తులు అడవిలో వెలసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వేసవి సెలవులు కావడంతో ఆలయం చెంత బంధుగణంతో జనజాతర సాగింది. పలువురు కొత్త వాహనాలకు పూజలు చేశారు.

### ప్రాచీన క్రీడ కర్రసాములో ప్రతిభచాటాలి

**మహబూబ్‌నగర్ క్రీడలు:** ప్రాచీన క్రీడ కర్రసాములో విద్యార్థులు ప్రతిభచాటాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మహాత్మా గాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ జహంగీర్ పాష ఖాద్రీ ఆధ్వర్యంలో వేసవి కరాటే శిబిరంలో భాగంగా ఆదివారం సిలంబమ్ (కర్రసాము)లో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని కొత్వాల్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనాలని కోరారు. కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో 26 ఏళ్ల నుంచి వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న జహంగీర్‌పాష ఖాద్రీని అభినందించారు. అంతకు ముందు నిజామాబాద్‌కు చెందిన సిలంబమ్ తెలంగాణ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ విద్యార్థులకు కర్రసాములో బేసిక్‌తోపాటు ఇతర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముస్తాక్ రషీద్, కింగ్ షోటోకాన్ క్లబ్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్, ప్యాట్రన్ లక్ష్మణ్, కోశాధికారి తిరుపతయ్య, బాలు, మహేందర్, అవేజ్ అహ్మద్ పాల్గొన్నారు.



# ఆదరణ కరువు..



ఎఫ్ఎస్‌టీపీలోని మలం వడపోత ప్రక్రియ జరిగే సంప్‌లు



సోలార్ స్లట్జ్ డయింగ్ బెడ్‌లోకి చేర్చిన ఎరువు

**మల వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని ఉపయోగించుకోని వైనం**

- మూడు రోజులకోసారి మాత్రమే ఒక సెప్టిక్ ట్యాంకర్ రాక
- గడువులోగా శుభ్రం చేయించుకోని భవన యజమానులు
- పరిశుభ్రతపై పట్టణ ప్రజల్లో కొరవడిన చైతన్యం
- సెప్టిక్ ట్యాంకులు లేకుండానే 30 శాతం నిర్మాణాలు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** అధికారుల నిర్లక్ష్యం.. పరిశుభ్రతపై ప్రజల్లో కొరవడిన చైతన్యం.. వెరసీ జిల్లాకేంద్రంలో మల వ్యర్థాల శుద్ధి కేంద్రం (ఫీకల్ స్లట్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్- ఎఫ్ఎస్‌టీపీ)ను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. జిల్లాకేంద్రంలో 50 వేల పైచిలుకు ఇళ్లు, వివిధ వాణిజ్య సముదాయ భవనాలు ఉన్నాయి. వీటిలో 30 శాతం వరకు సెప్టిక్ ట్యాంకులను యజమానులు ఏర్పాటు చేసుకోలేదు. దీంతో మల వ్యర్థాలు నేరుగా చిన్న చిన్న డ్రెయినేజీ పైపుల ద్వారా మోరీలు, ఓపెన్ నాలాలో కలిసి దుర్గంధభరితమైన వాతావరణం అలుముకుంది. పది విలీన గ్రామాలతోపాటు ముఖ్యంగా పాత ఇల్లు కలిగిన రామయ్యబౌళి, పాత పాలమూరు, వల్లభ్‌నగర్, మోతీనగర్, గచ్చిబౌలి, మేకలబండ, బండ్లగేరి, కిసాన్‌నగర్, హనుమాన్‌పురా, టీడీగుట్ట, వీరన్నపేట, బోయపల్లిగేట్, కొత్తగంజ్, సుభాష్‌నగర్, మోనప్పగుట్ట, ఝూన్సీనగర్, అరబ్‌గల్లీ, షాషాబ్‌గుట్ట తదితర ప్రాంతాల్లో చాలా వరకు సెప్టిక్ ట్యాంకులు లేవు. దీంతో మరుగుదొడ్ల నుంచి నేరుగా మలం మొత్తం మోరీలు, ఓపెన్ నాలాల గుండా వెళ్లడం వల్ల గల్లీ రోడ్లపై నడుస్తుంటే ముక్కుపుటాలు అదురుతున్నాయి.

**అవగాహన కల్పించరే..**

వాస్తవానికి ఇంటింటికీ తిరిగి సెప్టిక్ ట్యాంకుల అవసరం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. అలాగే మరుగుదొడ్ల ప్రతి మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించుకోవడం లేదు. వీటి గురించి ఇటు అధికారులు.. అటు ప్రజలు పట్టించుకోకపోవడంతో వివిధ వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. కాగా, ఈ నెల 7న ఎఫ్ఎస్‌టీపీని సీపీహెచ్‌ఈఈఓ ప్రతినిధి సంజయ్‌రౌత్ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి సెప్టిక్ ట్యాంకు ఏర్పాటు చేసుకోవాలని, మూడేళ్లకోసారి వాటిని శుభ్రం చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

**ఇదీ ప్రయోజనం..**

ఇక్కడి ఎఫ్ఎస్‌టీపీలో అన్ని దశల్లోనూ అధునాతన సాంకేతిక పద్ధతులను అవలంభిస్తున్నారు. చివరగా ఎనిమిది రోజుల్లో సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీనిని మొక్కల కోసం ఎవరికి అవసరమైతే వారు తీసుకెళ్లవచ్చు. నిర్వాహకులు ఉచితంగానే ఇస్తారు. ప్రస్తుతం ఈ ప్లాంటు ఆవరణలో సుమారు 300 మొక్కలు పెంచుతున్నారు. ఇక్కడ తయారయ్యే ఎరువునే వాడుతుండటంతో వాటి పెరుగుదల వేగంగా ఉంది.

**వాహనాలు ఏర్పాటు చేశాం**

పట్టణంలో జీపీఎస్ సౌకర్యం కలిగిన ఐదు సెప్టిక్ ట్యాంకర్లకు అన్ని అనుమతులు ఇచ్చి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ఏర్పాటు చేశాం. ఈ వాహనాలకు సంబంధించి ఫోన్ నంబర్లను ఆయా వార్డుల్లో గోడలపై రాయించాం. ఎక్కడైనా మూడేళ్ల గడువు ముగిసినా లేదా సెప్టిక్ ట్యాంకు నిండినా వెంటనే ఈ నంబర్లను సంప్రదించవచ్చు. ముఖ్యంగా ఇన్ శానిటేషన్ లెట్రిన్ వల్ల కలిగే దుష్పలితాలను ప్రజలకు వివరిస్తున్నాం. ప్రతి ఇంటికి సెప్టిక్ ట్యాంకు నిర్మించుకోవాలని సూచిస్తున్నాం.

– మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

**ఏడాదిన్నర క్రితమే..**

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో జిల్లాకేంద్రంలోని మౌలాలిగుట్ట వద్ద రూ.5.29 కోట్లతో నిర్మించిన ఎఫ్ఎస్‌టీపీని 2022 నవంబర్ 4న ప్రారంభించారు. సుమారు ఏడాదిన్నర కావొస్తున్నా ఈ ప్లాంటుకు మూడు రోజులకోసారి కేవలం ఒక సెప్టిక్ ట్యాంకర్ మాత్రమే వస్తోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ 50 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సంప్‌లు, యంత్రాలున్నా ప్రయోజనం దక్కడం లేదు. ప్రతిరోజు కనీసం మూడు సెప్టిక్ ట్యాంకర్లు వస్తేనే లక్ష్యం నెరవేరుతుందని నిర్వాహకులు ఆస్కీ మేనేజర్ సంజయ్ విల్సన్ చెబుతున్నారు. ప్రతినెలా ఈ ప్లాటులో నిర్వహణ ఖర్చులు, రసాయనాల వినియోగం, విద్యుత్ చార్జీలు, ఉద్యోగుల జీత భత్యాలు కలిపి మొత్తం రూ.2.50 లక్షల వరకు వెచ్చిస్తున్నామన్నారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నా.. ప్రజల్లో చైతన్యం కొరవడటంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. అలాగే పట్టణం నుంచి ఇక్కడికి సరైన రోడ్డు, ప్లాంటుకు నీటి సౌకర్యం లేదన్నారు.

# నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



పీయూలో స్ట్రాంగ్‌రూంలను పరిశీలించి తిరిగి వెళ్తున్న కలెక్టర్ రవినాయక్

- జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్
- పీయూ, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్‌రూంల పరిశీలన

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** ఈవీఎంలు, వీవీ ప్యాట్లను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. పాలమూరు యూనివర్సిటీ (పీయూ) లోని వివిధ విభాగాల భవనాల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంలు, వీవీప్యాట్లను ఆయా స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచిన విషయం విదితమే. ఆదివారం వాటి వద్ద పోలీసుల భద్రత, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు.

# విత్తనాలు సిద్ధం



తెలంగాణ విత్తనశుద్ధి కర్మాగారంలో నిల్వ చేసిన విత్తనాలు

**వానాకాలం పంటలకు అందుబాటులోకి తెచ్చిన అధికారులు**

- వనపర్తి విత్తనశుద్ధి కర్మాగారం నుంచే ఉమ్మడి జిల్లాకు సరఫరా
- పచ్చిరొట్టకు మాత్రమే రాయితీ వర్తింపు
- మిగతా వాటిపై 2020 నుంచి సబ్సిడీ ఎత్తివేసిన ప్రభుత్వం

**వనపర్తి:** రుతు పవనాలు ముందస్తుగా వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచన మేరకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ వానాకాలం పంటల సాగుకు కావాల్సిన విత్తనాలను సిద్ధం చేసింది. వ్యవసాయశాఖ అభ్యర్థన మేరకు ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు కావాల్సిన వరి, వేరుశనగ, కంది, మినుము, పెసర, శనగ విత్తనాలను సీజన్ ప్రారంభానికి ముందే ఆయా ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచేందుకు వ్యవసాయ, విత్తనాభివృద్ధి సంస్థల అధికారులు సంయుక్తంగా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వం 2020 నుంచి కేవలం పచ్చిరొట్ట విత్తనాలకు మాత్రమే రాయితీ ఇస్తుండటం.. మిగిలిన విత్తనాలపై ఎత్తివేయడంతో రైతులు పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. వనపర్తి జిల్లాలోని ఉమ్మడి జిల్లా ప్రాంతీయ విత్తనశుద్ధి కర్మాగారంలో ఐదు జిల్లాలకు కావాల్సిన విత్తనాలను శుద్ధిచేసి సిద్ధంగా ఉంచారు. పచ్చిరొట్ట విత్తనాలను ఆయా జిల్లాల వ్యవసాయ అధికారులతో ఇండెంట్ తీసుకొని సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు.

**వరి విత్తనాల ధరలు**

| విత్తన రకం.. | 25 కిలోలు (రూ.) |
|---|---|
| బీపీటీ 5204 | 1,133 |
| ఆర్ఎన్ఆర్ 15048 | 1,094 |
| కేఎన్ఎం 118 | 995 |
| జేజీఎల్ 24423 | 995 |
| ఎంటీయూ 1010 | 995 |
| కేఎన్ఎం1638 | 1,005 |
| వేరుశనగ కే-6 (30 కిలోలు) | 3,046 |

**అందుబాటులో ఉన్న విత్తనాలు**

| పంటరకం | నిల్వ (కింటాళ్లలో..) |
|---|---|
| వేరుశనగ కే-6 | 2,366 |
| లేపాక్షి 1812 | 1,235 |
| టీసీజీఎస్-1694 | 307.25 |
| శనగ జేజీ-11 | 2,582.50 |
| మినుము | 4.80 |
| పెసర | 13.64 |
| వరి (బీపీటీ 5204) | 1,000 |
| (ఆర్ఎన్ఆర్-15048) | 15,000 |
| ఎంటీయూ-1010 | 9,633 |
| కేఎన్ఎం-118 | 6,594 |
| కేఎన్ఎం-1638 | 4,600 |
| జేజీఎల్-24423 | 4,000 |
| మొత్తం విత్తనాలు | 47,336.19 |

**వరిలో ఆరు.. వేరుశనగలో మూడు రకాలు**

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సాగయ్యే వరి, వేరుశనగలోని అన్ని రకాల విత్తనాలను అధికారులు సిద్ధం చేశారు. వరిలో ఆరు, వేరుశనగలో మూడు, మినుము, పెసర, శనగ విత్తనాలు ఒక్కో రకం శుద్ధి చేసి రైతులకు అందజేసేందుకు విత్తనశుద్ధి కర్మాగారం అధికారులు ప్యాకింగ్ చేసి ఉంచారు.

**జిల్లాల వారీగా పచ్చిరొట్ట విత్తన వివరాలు (క్వింటాళ్లలో..)**

| జిల్లా | జీలుగ | జనుము | పిల్లి పెసర |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 1,820 | 318 | - |
| నారాయణపేట | 1,700 | - | - |
| వనపర్తి | 1,000 | 8 | 4 |
| నాగర్‌కర్నూల్ | 670 | 250 | - |
| జో.గద్వాల | 650 | - | - |

**పచ్చిరొట్ట విత్తనాలపై రాయితీ ఇలా..**

| పంట రకం | బస్తా (కిలోలు..) | పూర్తి ధర | రాయితీ | రైతులు చెల్లించాల్సిన ధర |
|---|---|---|---|---|
| జీలుగ | 30 | 2,790 | 1,674 | 1,116 |
| జనుము | 40 | 3,620 | 2,172 | 1,442 |
| పిల్లిపెసర | 20 | 2,710 | 1,626 | 1,084 |

**అందుబాటులో ఉంచాం..**



ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పీఏసీఎస్‌లు, ఆగ్రో సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులతోపాటు వరి, వేరుశనగ, పెసర, మినుము విత్తనాలను రైతులకు సోమవారం నుంచి అందుబాటులో ఉంచాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేవలం పచ్చిరొట్ట విత్తనాలకు మాత్రమే రాయితీ వర్తిస్తుంది. ఇతర విత్తనాలను పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గతేడాది రైతులు తీసుకున్న పచ్చిరొట్ట, వివిధ రకాల విత్తనాల లెక్కన వానాకాలం సీజన్‌కు కావాల్సిన విత్తనాలను శుద్ధిచేసి ఉంచాం.

– రాజీవ్, డీఎం, విత్తనశుద్ధి కర్మాగారం, ఉమ్మడి జిల్లా

# జడ్చర్లలో వేడెక్కుతున్న రాజకీయం

- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి 19 మంది సంతకాలతో కూడిన లేఖ సిద్ధం
- వైస్ చైర్‌పర్సన్‌ను సైతం తప్పించాలని మరికొందరు..
- నేడు కలెక్టర్‌ను కలవనున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు





**జడ్చర్ల టౌన్:** జడ్చర్ల మున్సిపాలిటీలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మిపై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు 19 మంది కౌన్సిలర్ల సంతకాలతో సిద్ధం చేసిన లేఖను సోమవారం కలెక్టర్‌కు అందించనున్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు పెట్టే అవిశ్వాసానికి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సైతం మద్దతిస్తామనడం విశేషం. అయితే చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్‌పర్సన్ పాలాది సారికపై కూడా అవిశ్వాసం పెట్టాలని కొందరు కౌన్సిలర్లు పట్టుబడుతున్నారని, అందుకోసం లేఖను సైతం సిద్ధం చేసి ఆరుగురు సంతకాలు చేసినట్లు తెలిసింది. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఇద్దరిపై అవిశ్వాసం పెట్టాలని కొందరు సభ్యులు పట్టుబడుతుండగా మరికొందరు మాత్రం ఒక్కరిపైనే పెట్టాలని చెబుతుండటంతో విభేదాలు నెలకొంటున్నాయి.

**సఖ్యత కొరవడటంతో..**

అనేక అవాంతరాల మధ్య 2021 ఏప్రిల్‌లో మున్సిపల్ ఎన్నికలు జరిగి మే 5న పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసింది. బీసీ మహిళకు చైర్‌పర్సన్ స్థానం రిజర్వు కావడంతో అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దోరేపల్లి లక్ష్మిని చైర్‌పర్సన్‌గా నిర్ణయించారు. అయితే అనూహ్యంగా వైస్‌చైర్మన్ స్థానం సైతం మహిళకే నిర్ణయించి బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన పాలాది రాంమోహన్ సతీమణి సారికను ఎంపిక చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 27 మంది కౌన్సిలర్లు ఉండగా 23 మంది బీఆర్ఎస్, ఇద్దరేసి చొప్పున కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎన్నికయ్యారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే సూచన మేరకు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగిపోయింది. ఆ తర్వాత 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ కౌన్సిలర్ కుమ్మరి రాజు కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల మరో ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో మొత్తం సంఖ్య ఆరుకు చేరింది. అయితే పాలక వర్గం ఎన్నికప్పటి నుంచి చైర్‌పర్సన్‌ల మధ్య సఖ్యత కొరవడటంతో మున్సిపాలిటీలో పాలన సైతం అస్తవ్యస్తంగా మారిందనే చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల ముందు, తర్వాత చైర్‌పర్సన్‌ను తప్పించాలని కొందరు నాయకులు, కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిపై ఒత్తిడి తేగా.. ఆయన దాటవేస్తూ వచ్చారు. ఈ క్రమంలో కౌన్సిలర్లు అవిశ్వాసం విషయంలో పట్టుదలగా ఉండటంతో మాజీ ఎమ్మెల్యే మీ ఇష్టం అన్న సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే అవిశ్వాసానికి సంతకం చేసినప్పటికి కౌన్సిలర్లు తమకేం లాభం అన్న చర్చను తెరపైకి తీసుకువచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా అవిశ్వాసం పెడితే ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ప్రస్తుత చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, ఆమె భర్త రవీందర్ రాజకీయ పండితుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది.

➡ పలుమార్లు సమావేశమైన కౌన్సిలర్లు 19 మంది సంతకాలతో కూడిన లేఖను సిద్ధం చేశారు. బీఆర్ఎస్‌లో 20 మంది కౌన్సిలర్లు ఉండగా చైర్‌పర్సన్‌ను మినహాయించి మిగిలిన వారంతా అవిశ్వాసానికి సంతకాలు చేసినట్లు తెలుస్తుంది. ఈ మేరకు శనివారం సాయంత్రం 4 గంటలకు కలెక్టర్‌ను కలిసేందుకు కొందరు కౌన్సిలర్లు సిద్ధపడ్డారు. అయితే భారీ వర్షం పడటంతో వాయిదా పడింది. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం కలెక్టర్‌ను కలిసేందుకు కౌన్సిలర్లు నిర్ణయం తీసుకున్నారు.

➡ అవిశ్వాసం పెడితే తదుపరి చైర్‌పర్సన్ ఎవరనే దానిపై పోటీ తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీలో ప్రస్తుత చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మిని మినహాయిస్తే కావలి శ్రీశైలమ్మ, చైతన్యగౌడ్, కోనేటి పుష్పలత, నవనీత, లత, హరిత బీసీ కౌన్సిలర్లుగా ఉన్నారు. వీరంతా చైర్‌పర్సన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు.

# చెంచు బిడ్డలకు అండగా..

- కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేసవిలో ప్రత్యేక తరగతులు
- చిన్నారులకు నిత్యం రాగి లడ్డు, రాగి జావా పంపిణీ
- నల్లమలలోని మారుమూల గ్రామాల్లో విస్తృత సేవలు



బల్మూరు మండలం బిల్లకల్‌లో కోనేరు సంస్థ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు



పదర మండలం ఉడిమిళ్లలో రాగిలడ్డు, జావా పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు



అమ్రాబాద్ మండలం ఉప్పనుంతల సమ్మర్ క్యాంపులో చెంచు చిన్నారులు

**సాక్షి, నాగర్‌కర్నూల్:** నల్లమల ప్రాంతంలోని చెంచు చిన్నారులకు కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రత్యేకంగా సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తోంది. వేసవిలో చాలావరకు చెంచు చిన్నారులు చదువుకు దూరంగా ఉంటూ, ఆ తర్వాత బడి మానేస్తున్నారు. ఏటా పాఠశాలల్లో డ్రాపౌట్ల సంఖ్య పెరుగుతుండటం గమనించిన కోనేరు సంస్థ అమ్రాబాద్, పదర, లింగాల, బల్మూరు మండలాల్లోని చెంచు చిన్నారులకు వేసవిలో ప్రత్యేకశిక్షణ కార్యక్రమాలను అమలు చేస్తోంది. నల్లమలలోని నాలుగు మండలాల పరిధిలో ఎక్కువ మంది చెంచు జనాబా ఉన్న 20 గ్రామాలను ఎంపిక చేసుకొని ఆయా గ్రామాల్లో సమ్మర్ క్యాంప్‌లను నిర్వహిస్తోంది. మొత్తం 500పైగా చెంచు చిన్నారులు ఈ సమ్మర్ క్యాంపుల్లో పాల్గొంటున్నారు.

**పోషకాహారలోపం నిర్మూలనకు రాగి లడ్డూల పంపిణీ..**

చెంచు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపుల్లో చదువుతో పాటు జనరల్ నాలెడ్జి, బయటి ప్రపంచంలోని విషయాలను సైతం బోధిస్తున్నారు. ఒక్కో గ్రామానికి ఒక్కో టీచర్‌ను నియమించి, ఆటాపాటలతో వారిలో చదువుపై ఆసక్తి పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నారు. చదువుతో పాటు డాన్స్, పేయింటింగ్, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, వ్యాయామం, స్టోరీ టెల్లింగ్, అబాకస్, చెస్ వంటి వాటిల్లో మెళకువలు నేర్పుతున్నారు. చెంచు చిన్నారుల్లో పోషకాహార లోపం నిర్మూలించేందుకు ఐరన్ ఎక్కువగా ఉండే రాగి లడ్డూలు, రాగి జావా పంపిణీ చేస్తున్నారు. మధ్యాహ్నం వేళ అన్నం, పప్పు, కూరగాయలతో భోజనం అందిస్తున్నారు. నల్లమల పరిసర ప్రాంతాల్లో చిన్నారులు వేసవిలో ఎక్కువగా ఈత కోసం బావులు, చెరువుల వద్దకు వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నాయని, వారికి చదువుపై ఆసక్తిని పెంచి, పాఠశాలల్లో డ్రాపౌట్లను తగ్గించేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నామని కోనేరు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

**'కోనేరు లక్ష్మి' ద్వారా మహిళలకు రుణాలు..**

కోనేరు స్వచ్ఛంద సంస్థ 25 ఏళ్లుగా నల్లమల ప్రాంతంలోని చెంచుల అభివృద్ధి, సాధికారత కోసం వివిధ కార్యక్రమాలను అమలుపరుస్తోంది. కోనేరు లక్ష్మి కార్యక్రమం కింద మహిళలతో స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు రుణాలను అందిస్తోంది. రైతులకు విత్తనాలు, స్ప్రే పంపులు, వ్యవసాయ పనిముట్లు, పరికరాలను ఉచితంగా అందజేస్తోంది. భూగర్భ జలాలను కాపాడేందుకు ఇంకుడు గుంతలు, వాటర్ షెడ్లు, చెక్‌డ్యాం నిర్మాణాలను చేపడుతోంది. చెంచు సమూహాల్లో బాల్యవివాహాలు, బాలకార్మికుల నిర్మూలన, ఫారెస్టు చట్టాలు, ఆర్‌ఓఎఫ్ఆర్ భూ హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు.

**చదువుపై ఆసక్తి పెంచేందుకు..**



వేసవిలో బడి సెలవుల తర్వాత చాలామంది చెంచు విద్యార్థులు బడి మానేస్తున్నారు. వేసవిలో చిన్నారులు ఈత కోసం బావులు, కాల్వల వెంట వెళుతూ ప్రమాదాలు గురవుతున్నారు. డ్రాపౌట్లు తగ్గించేందుకు వారిని చదువు, ఆటలతో మమేకం చేసేందుకు మా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. చిన్నారుల పౌష్టికాహారలోపం నివారణ కోసం నిత్యం రాగిలడ్డు, రాగి జావా అందజేస్తున్నాం.

– బాలకృష్ణ, కోఆర్డినేటర్, కోనేరు స్వచ్ఛంద సంస్థ

**ఘనంగా అగ్నిగుండ మహోత్సవం**

వివరాలు 8లో ▸

**నోరెళ్లబెట్టిన చెరువులు**

వివరాలు 9లో ▸

## క్లుప్తంగా

### శతాధిక వృద్ధురాలు మృతి


మల్లంపల్లి యల్లమ్మ (ఫైల్)

గట్టు: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు మల్లంపల్లి యల్లమ్మ (102) శనివారం రాత్రి మృతి చెందింది. ఈమె వయోభారంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త మల్లంపల్లి ఇట్టప్ప 35 ఏళ్ల క్రితమే మృతి చెందారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులు మొత్తం 111 మంది ఉన్నారు.

### ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం


మల్లేష్‌గౌడ్ (ఫైల్)

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లికి చెందిన కేశమోని మల్లేష్‌గౌడ్(38) ఆదివారం వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం. మల్లేష్‌గౌడ్ వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా మానసిక స్థితి బాగా లేక మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. ఆదివారం పొలానికి వెళ్తున్నట్లు ఇంటో చెప్పి ఉదయం 9గంటల సమయంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

### అమ్రాబాద్‌లో మరొకరు..


పవన్‌గౌడ్ (ఫైల్)

అమ్రాబాద్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అమ్రాబాద్‌కు చెందిన నోముల పవన్‌గౌడ్ (32) హైదరాబాద్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండే వాడు. ఐదు రోజుల కిందట బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటంతో స్వగ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి తల్లి స్వరూప ఉంది.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అడ్డాకుల: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కాటవరం స్టేజీ సమీపంలో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి(43) రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిందని చెప్పారు. ఈ ఘటనలో వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ట్రాక్టర్ బోల్తా

- బీఆర్‌ఎస్ యువనాయకుడి దుర్మరణం

మాగనూర్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో మండలంలోని నేరడగం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువనాయకుడు బసవలింగ (30) దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం పెద్దనంబ్రం సమీపంలోని తన వ్యవసాయ పొలం నుంచి శనివారం రాత్రి ట్రాక్టర్‌పై నేరడగం గ్రామానికి వస్తుండగా.. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. ప్రమాదంలో బసవలింగకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదివారం నేరడగం గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బసవలింగ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అతడి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని తెలిపారు.

### కుటుంబ కలహాలతో ఆర్‌ఎంపీ బలవన్మరణం

భూత్పూర్: కుటుంబ కలహాలతో ఓ ఆర్‌ఎంపీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భూత్పూర్ మండలం భగవాన్‌తండాలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. భగవాన్‌తండాకు చెందిన ఆర్‌ఎంపీ కేతావత్ మల్లేష్ (26) నాలుగేళ్లుగా హైదరాబాద్‌లోని గాజులరామారంలో ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తున్నాడు. అతడికి ఏడాది కిందట తిమ్మాజీపేట మండలం ఆర్‌సీ తండాకు చెందిన శిరీషతో వివాహమైంది. గాజులరామారంలోనే భార్యాభర్తలు నివాసం ఉండేవారు. సంసారం విషయంలో ఇద్దరు తరచూగా గొడవలు పడేవారు. ఈక్రమంలో శనివారం రాత్రి భగవాన్ తండాకు వచ్చిన మల్లేష్.. అర్ధరాత్రి తర్వాత పాయిజన్ ఇంజక్షన్ ఎక్కించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి తౌర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహం


పీయూలో కొనసాగుతున్న సింథటిక్ ట్రాక్ నిర్మాణ పనులు

## పీయూలో తుది దశకు సింథటిక్ ట్రాక్ నిర్మాణం

- దక్షిణ తెలంగాణలో హైదరాబాద్ తర్వాత ఇక్కడే..
- 400 మీటర్ల నిర్మాణం.. మధ్యలో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఏర్పాటు
- జాతీయస్థాయి పోటీలు నిర్వహించే అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ జాతీయ క్రీడలకు అతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతోంది. యూనివర్సిటీలో సుమారు 4 ఎకరాల స్థలంలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ నిర్మాణం కొనసాగుతోంది. ఆరునెలల కిందట పనులు ప్రారంభం కాగా.. ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయి. వచ్చే నెల చివరి నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు పనుల్లో వేగం పెంచారు. సింథటిక్ ట్రాక్ మధ్యలోని ఖాళీ స్థలం వృథా కాకుండా ఫుట్‌బాల్ మైదానం ఏర్పాటు చేయనున్నారు. పీడీగా పనిచేసిన లక్ష్మీకాంత్ రాథోడ్ వీసీగా బాధ్యతలు చేపట్టాక క్రీడల్లో తనదైన ముద్ర వేసేందుకు సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి పూనుకున్నారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నిధులకు ప్రతిపాదనలు పంపించారు. నిధుల మంజూరుకు ఆలస్యమవుతున్నందున యూనివర్సిటీ అంతర్గత నిధులు రూ.10.60 కోట్లతో పనులు చేపడుతున్నారు. తెలంగాణలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, గచ్చిబౌలి స్టేడియం తర్వాత పీయూలోనే సింథటిక్ ట్రాక్ నిర్మాణం జరగడం విశేషం.

**జాతీయ క్రీడల నిర్వహణకు..**

పీయూలో జాతీయస్థాయి క్రీడలు నిర్వహించేందుకు వీలుగా బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చింది. టెన్నిస్, టేబుల్ టెన్నిస్ కోర్టులో సింథటిక్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేశారు. ఆయా కోర్టుల్లో జాతీయస్థాయి క్రీడలు నిర్వహించేందుకు అవకాశం ఉంది.



### క్రీడాకారులకు వరం..



క్రీడాకారులు శిక్షణ తీసుకునేందుకు సింథటిక్ ట్రాక్ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేదు. వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ చొరవతో పాలమూరు యూనివర్సిటీలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అందుబాటులోకి వస్తే ప్రతిభ ఉన్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదిగే అవకాశం ఉంది. – శ్రీనివాసులు, పీడీ, పీయూ

### రూ.10 కోట్లకు పైగా వెచ్చించి..



సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి సుమారు రూ.10 కోట్లకు పైగా వెచ్చిస్తున్నాం. త్వరలో ట్రాక్ అందుబాటులోకి రానుంది. ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు ఇది గొప్ప వరం. పాలమూరు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొంటున్నారు. ఇక్కడ గ్రౌండ్ ఉండటంతో క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందనుంది. ట్రాక్ మధ్యలో ఫుట్‌బాల్ గ్రౌండ్ నిర్మించనున్నాం. – లక్ష్మీకాంత్ రాథోడ్, వైస్ ఛాన్స్‌లర్, పీయూ

### నిర్మాణ ప్రత్యేకతలు..

సింథటిక్ ట్రాక్ మొత్తం పొడవు 400 మీటర్లు. గ్రౌండ్ చుట్టూ సుమారు రెండు వేల మంది వీక్షించేలా పెవిలీయన్ (గ్యాలరీ) నిర్మించనున్నారు. పెవీలియన్ కింది భాగంలో క్రీడాకారులు ఉండేందుకు ప్రత్యేక గదులు నిర్మిస్తారు. వీటితోపాటు మరుగుదొడ్లు, ప్రత్యేకమైన లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. పెవీలియన్ నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. ట్రాక్ నిర్మాణం పూర్తయ్యాక పెవీలియన్ పనులు ప్రారంభం కానున్నాయి.

### గ్రౌండ్ నిర్మాణంతో కలిగే లాభాలు..

పీయూ పరిధిలో 125 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో చదివే విద్యార్థులు ప్రతి ఏటా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ, ఖేలో ఇండియా వంటి క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో అథ్లెటిక్స్ కీలకంగా ఉంది. ఇందులో 100, 200, 400, 800, 1,500 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్‌తో పాటు పలు పోటీలకు సిద్ధమయ్యేందుకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడ కూడా ప్రత్యేక మైదానం లేదు. దీంతో కొందరు క్రీడాకారులు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకొని జాతీయ క్రీడల్లో పాల్గొంటున్నారు. ఆర్థికంగా భారం కూడా. గ్రౌండ్ నిర్మాణంతో పూర్తిస్థాయిలో ఇక్కడే శిక్షణ తీసుకునేందుకు అవకాశం ఉంది. జాతీయస్థాయి క్రీడలు ఇక్కడే నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది. ప్రైవేట్ వ్యక్తులు వినియోగించుకుంటే యూనివర్సిటీకి ఆదాయం సమకూరనుంది.

# భారీగా నల్లబెల్లం పట్టివేత

- లింగాలలో 6,270కిలోలు, కల్వకుర్తిలో 1050 కిలోలు పట్టివేత
- తరలిస్తున్న వ్యక్తులు, వాహనాలు స్వాధీనం


లింగాలలో ఎక్సైజ్ శాఖ స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని శాయిన్‌పేటలో ఎక్సైజ్ శాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్ బృందం నాటుసారాకు ఉపయోగించే నల్లబెల్లం స్వాధీన పర్చుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అక్రమంగా డీసీఎంలో తరలిస్తున్న 209 సంచులు (6,270 కిలోల) నల్లబెల్లం స్వాధీనం పర్చుకున్నారు. ఎక్సైజ్ శాఖ సూరింటెండెంట్ ప్రదీప్‌రావు ఆదేశాల మేరకు రూట్ వాచ్ నిర్వహిస్తున్న సమయంలో బెల్లం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచి పట్టుకున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ రమణయ్య తెలిపారు. డీసీఎంతో పాటు బెల్లం స్వాధీన చేసుకుని, జూలూరి ప్రసాద్, వెంకటస్వామిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు జనార్దన్, బాలరాజు, సిబ్బంది యాదగిరి, శంకర్, కృష్ణ, ముజాఫర్ ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: నాటుసారా తయారు చేసేందుకు నల్లబెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకట్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కొల్లాపూర్ చెందిన భాస్కర్, రాంబాబు 1,050 కేజీల (30సంచులు) నల్లబెల్లం, 30 కేజీల పటిక, 4 లీటర్ల సారాను కల్వకుర్తి మీదుగా కొల్లాపూర్‌కు బొలెరో వాహనంలో రవాణా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

### పరుగుపందెంలో బంగారు పతకం


బంగారు పతకంతో కేతావత్ తరుణ్

గండేడ్: మండలంలోని మన్సూర్‌పల్లితండాకు చెందిన కేతావత్ తరుణ్ బంగారు పతకం సాధించారు. ఢిల్లీలోని జాతీయస్థాయిలో ఈనెల 18నుంచి 21 వరకు ఫిట్ ఇండియా ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగుపందెంలో పోటీల్లో ఈయన పాల్గొన్నారు. 800 మీటర్ల పరుగుపందెంలో తరుణ్ అందరికంటే ముందుగా పరిగెత్తి మొదటిస్థానంలో రావడంతో బంగారు పతకం వరించింది. ఈ సందర్భంగా గ్రామానికి వన్నె తెచ్చిన యువకుడిని, తల్లిదండ్రులను గ్రామస్తులు, మండల ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## టీస్టాల్‌ను ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు


వెల్దండలో టీస్టాల్‌ను ఢీకొట్టిన కారు

వెల్దండ: మండల కేంద్రంలో టీస్టాల్‌ను ఆదివారం హైదరాబాద్ నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. హైదరాబాదులోని ఉస్మాన్‌నగర్‌కు చెందిన గంధం మన్విత కుటుంబ సభ్యులతో శ్రీశైలం వెళ్తున్నారు. మార్గమధ్యలో వెల్దండకు రాగానే ముందుగా వెళ్తున్న మరోకారు బైక్‌ను తప్పించబోయి అకస్మాత్తుకు బ్రేక్ వేశాడు. వెనుక నుంచి వస్తున్న కారు ముందు వెళ్తున్న కారును తప్పించబోయి పక్కన ఉన్న టీస్టాల్, కిరాణషాపును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిరాణ షాపు వద్ద బైరాపూర్ చెందిన గోరటి చంద్రయ్య కాలు విరిగింది. అదేవిధంగా నల్లగొండ జిల్లా చండూర్ మండలం దేవుని తుమ్మలపల్లికి చెందిన సాల్వాది లక్ష్మయ్య కాళ్లకు గాయమైంది. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గాయపడిన వారిని వెల్దండలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

## పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు


పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: పండుగలను శాంతియుతంగా జరుపుకొని అందరికి ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఆదివారం మండలంలోని మాందాపూర్‌లో కొనసాగుతున్న వీరభద్రుడి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని దైవ ప్రార్థనకు కేటాయించాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని.. పిల్లలను మంచిగా చదివించాలని సూచించారు. అంతకుముందు మంత్రి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోటీలకు ఆర్థిక తోడ్పాటునందించిన ఆలయ కమిటీ సభ్యులను మంత్రి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు రవికుమార్, వెంకటేష్‌నాయుడు, కృష్ణయ్యసాగర్, గోవర్ధన్‌సాగర్, జయరాములుసాగర్, కృష్ణప్రసాద్‌యాదవ్, భాస్కర్‌యాదవ్, బ్రహ్మయ్య, కుమార్‌గౌడ్, పుల్లారావు, అశోక్‌నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**విజేతగా నిలిచిన తాడూరు వృషభాలు..**

అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్‌కు చెందిన టీసీఆర్ బుల్స్ అఖిలేష్‌రెడ్డికి చెందిన ఎద్దులు మొదటి స్థానంలో, నంద్యాల జిల్లా గున్నప్లదిన్నెకు చెందిన రాంభూపాల్‌రెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో, గుంటూర్ జిల్లా కుందెనపల్లికి చెందిన పీఆర్ మెమోరబుల్ ఎద్దులు మూడోస్థానంలో, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లికి చెందిన నాగయ్య ఎద్దులు నాలుగో స్థానంలో, కర్నూలు జిల్లా వల్కూర్‌కు చెందిన దొడ్డికాడి తిరుమల్లేష్ ఎద్దులు ఐదోస్థానంలో, వనపర్తి జిల్లా పెద్దగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దులు ఆరో స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతిగా రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.40 వేలు, నాలుగో బహుమతి రూ.30 వేలు, ఐదో బహుమతి రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలను యజమానులకు నిర్వాహకులు అందజేశారు. వ్యాఖ్యాతగా రహమాన్ వ్యవహరించారు. మంత్రి జూపల్లితో పాటు రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ చింతలపల్లి జగదీశ్వర్‌రావు, కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు డా. పగిడాల శ్రీనివాసులు, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు తిరుపతయ్యసాగర్‌తో పాటు పలువురు నాయకులను నిర్వాహకులు సన్మానించారు. మాజీ సర్పంచ్ జయరాములుసాగర్, గోవర్ధన్‌సాగర్, కృష్ణయ్యసాగర్, కాంగ్రెస్‌పార్టీ మండలపార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, వివిధ గ్రామాల వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


బండ లాగుతున్న వృషభాలు

# ఘనంగా అగ్నిగుండ మహోత్సవం


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

నవాబుపేట: మండలంలోని లోకిరేవు వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అగ్నిగుండ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన అగ్నిగుండ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పలువురు భక్తులు అగ్నిగుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఈసందర్భంగా ఓం నమః శివాయ, ఓం వీరభద్రాయ నమః నామస్మరణ మార్మోగింది. అదేవిధంగా వీరభద్రస్వామి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవమూర్తిని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి లింగయ్య, వీరన్న, రాజు, మాజీ సర్పంచ్ వెంకటేష్, శ్రీనివాస్, బాలు, యాదయ్య పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి

## ప్రతి అథ్లెట్ చాంపియన్ కావాలి


క్రీడాకారులకు సామగ్రి పంపిణీ చేస్తున్న రజనిసాయిచంద్

జడ్చర్ల టౌన్: ప్రతి అథ్లెట్ చాంపియన్ కావాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజనిసాయిచంద్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో క్రీడాకారులకు క్రీడా పరికరాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి అడుగు ఎప్పుడు కష్టంగానే ఉంటుందని, వెనకడుగు వేస్తే ఛాంపియన్ కాలేమన్నారు. ఏ రంగంలో అయినా విజయం సాధించాలంటే దృఢ సంకల్పం, పట్టుదల ఉండాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు మనకెందుకులే అని అనుకోకుండా పోటీపడి విజయాలు సాధించాలన్నారు. అథ్లెటిక్స్‌లో మంచి నైపుణ్యం సాధించి జడ్చర్లకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కోచ్ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## జోగుళాంబ సన్నిధిలో విద్యాశాఖ అదనపు డైరెక్టర్లు


జోగుళాంబ సన్నిధిలో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు జి.యాదగిరి, డీఎస్‌ఆర్ రాజేందర్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ (మల్టీ జోన్-2) జి.యాదగిరి, మల్టీజోన్-1 జాయింట్ డైరెక్టర్ డీఎస్‌ఆర్ రాజేందర్ దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం రససిద్ధి గణపతికి పంచామృత అభిషేకాలు, బాలబ్రహ్మేశ్వర స్వామికి ఏకవార రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి ఖడ్గమాల, త్రిశతి వంటి అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. వీరితో పాటు గద్వాల డిగ్రీ కళాశాల లెక్చరర్ పిండి కృష్ణమూర్తి, అధ్యాపకులు శ్రీరాముడు, చిన్నరాజు ఉన్నారు.

## సమాంతర కాల్వకు నీటి విడుదల


సమాంతర కాల్వలో పారుతున్న నీరు

తాగునీటి అవసరాలకుగాను ఆదివారం జూరాల ప్రాజెక్టు సమాంతర కాల్వ ద్వారా 320 క్యూసెక్కుల నీటిని రామన్‌పాడు జలాశయానికి విడుదల చేసినట్లు సమాంతర కాల్వ ఏఈ శంకర్ తెలిపారు. కర్ణాటకలోని నారాయణపూర్ డ్యాం నుంచి 1.9 టీఎంసీల నీరు విడుదల చేయగా జూరాల జలాశయానికి చేరుకున్నట్లు వివరించారు. మిషన్ భగీరథ తాగునీటి పథకాల కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని తరలిస్తున్నట్లు వెల్లడించారు. – అమరచింత (వనపర్తి)

### వర్షానికి హైవేపై విరిగిపడిన చెట్టు


చంద్రశేఖర్‌నగర్‌లో హైవేపై విరిగిపడ్డ చెట్టు

మానవపాడు: జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మండలంలోని చంద్రశేఖర్‌నగర్ శివారుప్రాంతంలో రోడ్డు తుమ్మ చెట్టు విరిగి పడింది. దీంతో రహదారిపై కొద్ది సేపు వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు, గ్రామస్తుల సహకారంతో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. రోడ్డుపై చెట్టు కొమ్మలను గ్రామస్తులు శుభ్రం

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఊర్కొండ: పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి ఆదివారం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ ఇస్మాయిల్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని జకినాలపల్లికి చెందిన పోలె రామచంద్రయ్య (57) మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్య వెంకటమ్మను నిత్యం వేధించేవాడు. ఈ నెల 17న మద్యం మత్తులో భార్యతో గొడవపడి పొలానికి వెళ్లి అక్కడున్న పురుగుమందు తాగి ఇంటికొచ్చి ఆవరణలో పడిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుమారుడు పోలె సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ వివరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు.